# వేళావిశేషం

## కథానిక

సత్యానికి ముప్ఫైయేళ్ళుంటయ్. పెళ్ళై కుటుంబ భారం నెత్తిన బడటంకూడా ఏడెనిమిదేళ్ళకు మించలేదు. అప్పుడే అతనికి భవిష్యత్తులో జరుగు బాగెట్లగా అనే భయం ఏర్పడింది. డబ్బులు కర్చుబెట్టడంలో అతడనేక హద్దు లేర్పరుచుకొని-ఆగిరులుదాటి ఒక్కదమ్మిడి కర్చుబెట్టాలన్నా గిజగిజ లాడిపోయేవాడు. కాని తలవనితలంపుగా అనేక వుపద్రవాలు వచ్చిపడేవి. దాంతో అతని ఆర్థిక కట్టుబాట్లన్నీ తారుమారుగావటమే గాకుండా నలుగురిలో నవ్వులపాలై పోవటం కూడా జరుగుతుండేది.

ఒక ఆదివారంపుదయం సత్యం దుప్పటిముసుగులో వెచ్చగా నిద్రపోతున్నాడు. అతని భార్య రాజమ్మ పిల్లలను సముదాయిస్తూ అప్పుడే వచ్చిన పాలమనిషితో మాట్లాడుతూ వుంది. ఆ సందడికి సత్యం మేలుకొని మెల్లగా కళ్ళువిప్పి తన అరచేతులను చూసుకున్నాడు. పొద్దున్నే ఎవరి ముఖంచూస్తే ఏమిమూడుతుందోననే భయంతో నిద్రలేవగానే తన అరచేతులు చూసుకోటం అతని కలవాటు. ఇల్లంతా వుదయకాంతిలో నిండివుంది. "అరె చాలాయెండ బడిందే–" అని తత్తరపాటుతో అంటూ—చివ్వునలేచి తొలగిపోయిన పంచెను సవరించుకోసాగాడు.

"ఏమిటా హడావుడి. యీరోజు ఆదివారం కూడాను–" రాజమ్మ భర్తవైపుచూస్తూ అన్నది.

"ఆఫీసులో అవసరమైన పనుంది. నీవు త్వరగా కానీ–" అంటూ దొడ్లోకి దారితీశాడు.

రాజమ్మ కుంపటిరాజేసి కాఫీ కాచేలోగా సత్యం ముఖం కడుక్కొని వేడికాఫీ ఆదరాబాదరా తాగి ఆఫీసుకు బయలుదేరాడు. పది బారలు నడిచాడో లేదో చెప్పు తెగిపోయింది. "అరెరె యిదీ యిప్పుడే తెగాలీ. బజారులో రెండణాలన్నా చార్జి చేస్తారు వెధవలు. ఎందుకు దండగ. యింటికిపోయి మేకులుకొట్టుకో వచ్చు." పక్కకు తొలిగే చెప్పును ప్రయాసతో యీడ్చుకుంటూ నడవసాగాడు. బజారుకొచ్చేటప్పటికి అతన్ని ఓ ప్రమాదం ఎదుర్కొంది. చెట్లక్రింద చెప్పుల మరామత్తు కార్ఖానాలు పెట్టిన వాళ్ళలో కొందరు, "నిమిషంలో తెగిన చెప్పును మరామత్తు చేసియిస్తామ"ని చెపుతూ అతనిదారికి అడ్డం తగిలారు. వారిలో ఒకడు అతని చెప్పును లాగేయటానికికూడా పూనుకున్నాడు. ఆప్రమాదాన్ని ముందే గుర్తించిన సత్యం అతి హుషారుగా పక్కకు తప్పుకున్నాడు. ఇంతలో అటు అతివేగంగా వస్తున్న ఒక గుర్రపుబండి సత్యాన్ని రాసుకొనిపోతూ అతని పైపంచెను తన కడచీలకు యిరికించుకోగా—అతని మెడ గుంజినట్లై ముందుకు తూలాడు. పై పంచలో కొంతభాగం తెగి గాలికి రెపరెపలాడుతూ బండితోటే ప్రయాణమైపో సాగింది. ఈ హఠాత్సంభవానికి సత్యం ఒక్కక్షణం నివ్వెరపోయి చీలికలైపోయిన తన వుత్తరీయాన్ని చూసుకొని భారంగా ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడిచాడు. ఈ వింతదృశ్యం బజారులోని విశేష ప్రజానీకాన్ని ఆకర్షించింది. వారంతా సత్యంచుట్టూ పోగై అతని అజాగ్రత్తను విమర్శిస్తూ కొంటెగా నవ్వసాగారు. అతడు తన్నుచుట్టు ముట్టిన జనాన్ని చీల్చుని బయటపడి నల్లబడ్డ ముఖంతో తలవంచుకొని తెగిన చెప్పును యీడ్చుకుంటూ నడవసాగాడు. "లేచిన వేళావిశేషం. ఈ పంచె ఒకటి ఆధారంగావుంటూ వచ్చింది. కళ్ళు పొరలు కమ్మినట్టున్నయ్ వెధవకి. బండి పైకి తోలుతాడూ—" చినుగు కనిపించకుండా మడతవేయడానికి ప్రయత్నిస్తూ తన వుత్తరీయానికి పట్టిన దుర్గతికి చింతపడసాగాడు. ఆఫీసుగదిలో కాలు పెడుతుండగానే "చాలా పెందలాడే వచ్చావే—" అని హెడ్క్లర్కు—

పి. వి. రెడ్డి

ముఖం చిట్లించాడు. సత్యం నిరుత్తరుడై కుర్చీలో కూలబడి టేబిలుపైవున్న ఫైల్సు అందుకున్నాడు. "సెలవునాడుకూడా బండెడుచాకిరి. పైగా పెండ రాడె రాలేదట పెండలాడె-" సత్యం రోషంతో గొణుక్కున్నాడు.

పదకొండు గంటలకుగాని ఆఫీసుపని తెమల లేదు. సత్యం హెడ్ క్లర్కుగారికి ఫైల్సు అందించి ఆఫీసునుండి బయటపడ్డాడు. ఈసారి బజారు దోవను తప్పించి సందుగొందులు తిరిగి యింటికి చేరాడు. చెప్పులువిడిచి ఒకమూలకు విసిరివేస్తూ "వెధవచెప్పులు సమయానికి తెగిఊర్చుంటయ్-" ఉత్తరీయం కొంకికి తగిలించటంతో అతని చేతులు వణికినై "మంచి సరిగ కండువ. ఇక ఈ జన్మలో కొనలేము" అతడు భారమైన హృదయంతో మంచంమీద కూలబడ్డాడు. ఇంతలో దొడ్లో వాళ్ళ అమ్మను వేధిస్తున్న రామూ-గోపీ తండ్రి రావటంచూసి అతనిదగ్గరకు పరుగెత్తారు.

"నాన్నా! నాన్నా!"

"ఏమిట్రా ఏం?" సత్యం కోపంతో వుడికిపోతూ అన్నాడు,

"బండి నాన్నా-అందరూ కొనుక్కున్నారు నాన్నా!"

"ఏం బండిరా—"

"బలేబండి నాన్నా. ఢం ఢం అని మోగుతుంది."

"ఒక్కటి కొను నాన్నా—" గోపీ జారిపోయే లాగు లాక్కుంటూ అన్నాడు.

"ఇప్పుడు డబ్బులెక్కడివి పొండి."

"అందరూ కొనుక్కున్నారు నాన్నా."

"డబ్బులు లేవురా అంటే-పొండి ఇక."

ఇంతలో అతని భార్య రాజమ్మ అక్కడకు వచ్చి—

"ఎందుకాలా కసురుకుంటారు పిల్లల్ని?"

"బండట-కొనీ..."

"ఇతర పిల్లలు కొంటే వాళ్ళకుమాత్రం ఆపేక్ష వుండదూ?"

"డబ్బులుంటేగా."

"ఆరణాల భాగ్యానికి?"

"వుంటేగా-ఎంతైనా."

"ఇందాకటినుంచి నన్ను వేధిస్తూంటే - మీ నాన్న వచ్చినాక కొనిస్తా లెండ్రా - అన్నాను. వాళ్ళెంతో ఆశతో వున్నారు. పిల్లలుకదూ"

"మంచి ఘనకార్యమే చేశావు. చేతిలో దమ్మిడీలేక మనంపడే అవస్థ ఏమిటి"

"మీరెప్పుడూ అంతే. అంత మరీ పిశినారితనమైతే"

"నీవూ ఆమాటన్నావూ? ఆఫీసులో వుండే ప్రతివాడూ నన్ను పీనాశివాడికింద జమకట్టి మాట్లాడుతూ వుంటారు. ఆఫీసు గుమస్తా పీనాశిగాక కర్ణుడైతే జరుగుబాటు..."

"ప్రతిదానికీ లబలబలాడండి. ఎంత లబలబలాడినా మీరు మిగిల్చేదేమీలేదు. ఆ పిల్లలైనా ఎప్పుడోకాని ఆపేక్ష పడరు. దానిక్కూడా... ఏంజీవితం పాడుజీవితం"

"పొట్ట గడవటమే కష్టంగా వుంటే బండెక్కడ కొంటావే — చెప్పుకూడా యిప్పుడే తెగింది. ఆ గూట్లో మేకులుండాలి. అవైనా వున్నాయో-లేకుంటే యిప్పుడు వాటికెంతో తగలెయ్యాలి. ఒరే రామూ కొంచెం చూడు..."

"వూ-హూ బండి కొనిస్తానని—"

"నేను చేస్తాపోరా—గూడుబండికదూ?"

"అవును నాన్నా. అదే బలే మోగుతుంది నాన్నా."

"మనదీ అంతకంటే బాగా మోగుతుంది. చిన్న ఎదురు బద్ద, ఒక టెంకాయిచిప్ప వుంటే చాలు. బండి తయారైపోతుంది. చక్రాలుకూడా వున్నయ్ తయారుగా."

"ఎక్కడివి నాన్నా?"

"పొద్దునటుపోతే చిక్కినవిలే. ఏమోవే ఒక టెంకాయి చిప్ప చూడు,"

"యిప్పుడు చేస్తారా యేమిటి?"

"లేకుంటే వీళ్లు బతకనిస్తారా!"

"మీరు చేయటం. అంతబాగా రాదులెండి."

"నీకేమి తెలుసే రాజ్యం. నేను చేస్తాగా. ఒరే రామూ ఒక చిన్న ఎదురు దబ్బ సంపాదించండి."

"ఎక్కడుంది?"

"అక్కడ వీధిలో పాత తడికవుంది. ఎవరో పారేశారు. ఒక చిన్న బద్ద తుంచుకురండి."

"నేను చూపిస్తారాఅన్నయ్యా నాకు తెలుసు" అని గోపీ సంతోషంతో అరిచాడు.

"అవునురా. తెస్తాంరా."

పిల్లలిద్దరూ పరుగెత్తుకుంటూ వెళ్ళారు.

"వృధాగా ఆరణాలు తగలేసే దానికంటే కొంచెంసేపు అవస్థపడితే బండి తయారవుతుంది. ఈ రోజెటూ సెలవేగా."

"ఇలా తయారయ్యారేమిటి?"

"ఏలా తయారయ్యాను? ఏదీ యిటురా."

"మరీ మీకు...తాళండి" రాజమ్మ అతన్ని తప్పించుకొనిపోతూ "కానిచ్చి తిండికి లేవండి" అని అన్నది.

సత్యం తిండితిని ఎదురుపుల్లలు టెంకాయి చిప్ప వగైరా సామగ్రితో పిల్లలమధ్య కూర్చొని బండి తయారు చేయటానికి పూనుకొన్నాడు.

"ముందు యీచక్రాలకి తొఁర్రలు కొడదాం. ఒక చీల కావాల్నే"-పిల్లలెక్కడో వెతికి చీల పట్టుకొచ్చారు.

"కొట్టడానికేదైనా యినుపముక్క—"అది కూడా పిల్లలు నిమషంలో సంపాదించారు. డబ్బామూతలవంటి రెండు రేకుబిళ్ళల్ని పిల్లలకు చూపి: "యివిరాచక్రాలు." పిల్లలు సంతోషంలో ఎగిరి గంతేసి-"ఎక్కడవినాన్నా యివి—" "దొరికినవి. మీరుకొంచెం అటు తొలగండి. తొర్ర వేసేవద్ద గుర్తుపెడదాం. అటు జరగండ్రా అంటే వెలుతురు రావద్దూ-" సత్యం చక్రానికి తొర్ర వేసేవద్ద గుర్తుపెట్టి, ఆ గుర్తువద్ద చీల పెట్టి యినుపముక్క తీసుకొని గట్టిగా బాదాడు. ఢాం అనే బ్రహ్మాండమైన శబ్దంతో పొగ యిల్లంతా చుట్టుకొంది. పిల్లలు భయిపడి "అమ్మో" అని కేక పెట్టి మిట్టకుపరుగెత్తారు. వంటిట్లోవున్న రాజమ్మ కంగారుగా భర్తదగ్గరికి పరుగెత్తింది. సత్యంస్పృహ లేకుండా కిందపడివున్నాడు. రా జ మ్మ అతన్ని ఊపుతూ "ఏమండీ- ఏమయింది- అయ్యో-పలకరేం..." ఏడవసాగింది. ఇంతలో ఈ శబ్దంవిని చుట్టుపక్కలవాళ్లు పరుగెత్తుకుంటూ వచ్చారు.

"ఏమయింది? అలాపడిపోయినాడేం? అబ్బా ఏమిటా నెత్తురు—"ఎవరో అనగా అప్పుడు సత్యం చేతివైపుచూసింది రాజమ్మ. చేతివ్రేళ్ళు చిటికి నెత్తురు కారుతున్నయ్.

"ఆ బిళ్ళలకు తొర్రవెయ్యబోతే యీపని జరిగింది నాయనా-కొంచెం అవెళ్లి డాక్టర్ని పిలవండి."

డాక్టరుకోసం పొరుగింటి అబ్బాయి పరుగెత్తాడు.

ఇల్లంతా చూడవచ్చిన జనంతో నిండిపోయింది. సత్యాన్ని మంచంమీదికి చేర్చారు. ఇంతలో డాక్టరువచ్చి, ఏమిజరిగిందని అడగగా—అరుగుపైవున్న బిళ్ళనుచూపుతూ దానికి తొర్ర కొట్టబోగా అది ప్రేలిందని, పడిపోయాడని తలో ఒకమాటచెప్పారు. డాక్టరు సత్యాన్ని పరీక్షించి ప్రమాదంలేదని చెప్పుతూ చేతికి కట్టుకట్టడానికి ప్రారంభించాడు. ఆ యింటికుండేది ఒక్కకిటికీ—యింట్లో ఖాళీలేకపోవటంతో ఆ కిటికీనిగూడా వచ్చిన జనం తమ తలలతో కప్పేశారు. ఇల్లంతా చీకటికమ్మేసింది. డాక్టరు చూడవచ్చిన జనాన్ని మందలిస్తూ—"యిక చూచిందిచాలు. బయటికి వెళ్ళండి, పగలే చీకటిగాచేశారు యింటిని. ఊఁ కదలండి. కొంచెం వెల్తురొస్తేనేగాని—నేను పని జేసేదెట్లా-దయయుంచి బయటకుపొండి" అని అన్నాడేగాని జనం ఏమాత్రం తగ్గలేదు. "ఆ కిటికీకడ్డంలెండి. ఆయనకుకొంచెం గాలి తగలాలి. మీకే చెప్పేది."కిటికిలోని తలకాయలు వెనక్కు జరిగినయ్. డాక్టరు చేతికి కట్టుకట్టాడు. సత్యం మెల్లిగా కళ్లువిప్పి బాధతో మూల్గసాగాడు.

"కొంచెం వేడికాఫీ పట్టుకురండి—"

రాజమ్మవద్ద డబ్బులూ లోటాతీసుకొని పొరుగింటి అబ్బాయి హోటలుకు పరుగెత్తాడు. ఇంతలో సత్యం స్నేహితుడు ముకుందం వచ్చి—"ఏమిటిది? వూరంతా బాంబు ప్రేలిందని పుకారయిందే. వీడు బాంబెక్కడ సంపాదించాడు?"

"బాంబుకాదండీ, టపాకాయి. వీటిని రైలు వాళ్ళకిస్తారు. వీటిని మనవాడు ఎక్కడ సంపాదించాడో-" డాక్టరు ఆ బిళ్ళను ముకుందానికి చూపుతూ చిరునవ్వుతో అన్నాడు.

"అరె. .యింత పనిచేసింది యిదన్నమాట. దాన్నేంచేయబోయాడు?"

"పిల్లలకు బండిచేసిస్తానని, వాటికి తొర్రవేయబోతే యీ పని జరిగింది-"రాజమ్మ కళ్ళనీళ్ళు తుడుకుంటూ అన్నది. ఇంతలో కాఫీ తేగా సత్యానికి తాగించారు.

"ఎట్లావుంది..." డాక్టరు సత్యాన్ని అడిగాడు.

"అబ్బా! చెయ్యిపోటు" సత్యం హీనస్వరంతో అన్నాడు.

"ఆ బిళ్ళలెక్కడ సంపాదించాడో—వాటికి తొ్రవేయబోవటం-ప్రతిదీ యిట్టనే నెత్తికెత్తుకుంటూవుంటాడు."

"అవి అంత ప్రమాదకరమైనవని నాకేం తెలుసూ..."

"ఇక పోనీయండి. కొంచెం విశ్రాంతి అవసరం. సాయంత్రం హాస్పిటలుకురా — అవసరమయితే మందిస్తాను" అంటూ డాక్టరు లేవగా ముకుందం అతన్ని సాగనంపాడు. ఇల్లు పోయేజనంతో పల్చబడుతూ మళ్ళీ కొత్తవారితో నిండిపోతూ వుంది.

"యిక వెళ్ళండిరాబాబూ. ఆయనకు కొంచెం గాలి తగిలితేనేగాని కోలుకోడు. వెళ్ళండి—" ముకుందం జనాన్ని బైటకుతోలాడు.

"ఎట్లుంది? నొప్పిగావుందా—వెధవది ఆ బండి కొంటే సరిపోయేదిగా—" రాజమ్మ ,భర్త మంచం దగ్గరికిపోయి అతనితో అన్నది.

"పిల్లలేరి?" సత్యం హీనస్వరంతో అన్నాడు.

"అరుగో—వాళ్ళకేమీ దిక్కుతోచలేదు."

"ఏం పరవాలేదు. ఎందుకమ్మా నీవింకా బెంబేలుపడతావ్" ముకుందం జాలిగా అన్నాడు. ఇంతలో వీధిలో సందడి- సత్యంగారి యిల్లు యిదేనా అని ఎవరో అడగటం యిదే యిదేనని ఎవరో చెప్పటం-వీధికిమళ్ళిన జనం ఇద్దరు పోలీసు వాళ్ళతోసహా సత్యం యింట్లోకి జొరబడ్డారు.

"సత్యం ఎవరండి-మీరేనా—" ఫ్రెంచికట్ మీసాల పోలీసాయన దబాయించినట్టుఅడిగాడు

"నేనే-ఎందుకు-"

"మీరు రైల్వే కాబిన్‌లో జొరబడి టపాకాయలు దొంగిలించి పేలుస్తున్నారట. స్టేషను మాష్టరుదగ్గరకు పదండి"

"నేను దొంగలించలేదు."

"ఆ విషయమే చెపుదురుగాని పదండి."

"ఇప్పుడే ప్రాణం పోయినంత పనయింది రాలేను" దీనంగా అన్నాడు సత్యం.

"వారికి స్పృహవచ్చింది యిప్పుడే. నేనువచ్చి మాట్లాడుతా పదండి." ముకుందం లేచాడు.

"అదేం వీలులేదండి. వారురాకుంటే కేసు పెట్టాల్సివస్తుంది."

"ఇదేంకర్మ బాబూ మళ్ళా యిదొకటా, యిప్పుడే కాస్త కుదుటబడ్డది ప్రాణం" రాజమ్మ నిలువునా కూలిపోయింది.

"ఏదో ఒకటిచేస్తేనే కదండి. లేకుంటే ఎందుకొస్తవి? ఆ గేటువాడు మూడు రోజులనుంచి టపాకాయలు పోయినందుకు లబోదిబో యేడుస్తున్నాడు. అవి లేకపోతే వాడి నౌకరీ కూడా పోతుంది. వృధాగా అవెందుకండి తేవటం?"

"నాకవి గేటుదగ్గర దొరికినయ్. దొంగతనం చేశాననా మీ వుద్దేశం?"

"ఏమో మాస్టరుగారిదగ్గర కొచ్చి ఆ విషయమే చెప్పండి."

"నేను రాలేనే."

"ఏలాగో అవస్థపడాలి."

"ముకుందం ఏంజేస్తాం యిక, బండిని పిలిపించు వెళ్ళొస్తాం" అని అన్నాడేగాని అతని గుండె వేగంగా కొట్టుకోసాగింది. చెయ్యి బాధగావుంది. పోకపోతే కేసు బెడతారని భయం. రాజమ్మ ఏడుస్తూ తానుకూడా వస్తానన్నది.

"మీ రెందుకులెండి. నేను వెళ్లొస్తాగా, మాస్టరుగారు నాకు బాగాతెలుసు" అని ముకుందం అంటూవుండగా బండి వచ్చింది. సత్యాన్ని బండికెక్కించి రైల్వేస్టేషనుకు బయలుదేరారు. బండితోటే జనంకూడా వుత్సవం మాదిరి కదిలిపోసాగారు.

బండి అటు కదలగానే రాజమ్మ యింట్లో నిలవలేకపోయింది. రాముా, గోపీ బిక్కుబిక్కుమంటూ ఒకమూల కూర్చొనివున్నారు. ఆ బిడ్డలను చూసి ఆమె హృదయం తరుక్కుపోయింది. వారిని దగ్గరకు తీసుకోగానే పిల్లలు బావురుమన్నారు. పిల్లలూ తల్లీ అలాగే ఎంతసేపో ఏడుస్తూ వుండిపోయారు. రాజమ్మ తలుపు వేసుకొని పిల్లలను తీసుకొని స్టేషనుకు బయలుదేరింది. మధ్యలోనే సత్యం బండిఎదురుపడగా ముకుందం బండి దిగి నవ్వుతూ "ఆ వెధవ పారవేసుకొన్నది నిజమేనట. వాడికే నాలుగు చీవాట్లు పడ్డయ్ మీకు యింట్లో కాలు నిలిచివుండదు."

"ఏమిటో దిక్కుతోచలేదు" అందరూ తిరిగి యింటికివచ్చారు. ముకుందం సాయింత్రం వస్తానని వెళ్ళిపోయాడు. సత్యం మంచంమీద పరుపు

కాసుకొని కూర్చొని దీనంగా భార్యవైపు చూశాడు.

"ఏంపనిచేశారండి. భయంతో చచ్చిపోతినే"

"భయపడ్డావా రాజ్యం. ఏది, ఆ చెయ్యి యిటు వెయ్యి, కొంచెం వేడిగా వుందికదూ. జ్వర మొస్తుందేమో. ఆ డాక్టరుకి, బండికి ఏదో యివ్వాలి. అన్నీ దండగలే. ఏదో మిగిలిద్దామనే వుద్దేశంతో ఏదో ఒకటి చేయబోవటమూ ప్రతి సారి ఇదేవిషంగా అపహాస్యం పాలుగావటమూ. యింత తెలివి తక్కువ దద్దమ్మను కట్టుకొని—"

బావురుమని ఏడ్చాడు సత్యం.

"ఏమిటిది యిప్పుడేమొచ్చిందని. పిల్లల్ని దగ్గరకు పిలవండి. వాళ్లు యెలాబెంబేలుపడి..."

"నాయనా రామూ. గోపీయేడి ఇటురండి. రేపు కొనిస్తాలే బండి."

"బండికొచ్చిందిది యిప్పుడు. పోయి ఆడు కోండి. నేను కొనిస్తాలే."

"ఏమిటో దిగులుగావుంటుందే. యీ పిల్లల్ని చదివించి..."

"అప్పటికి చూచుకోవచ్చు. మీరింకేమీ ఆలోచించకుండా పండుకోండి"

"రాజ్యం ఎందుకీ జన్మ. నేనెవరినీ సుఖపెట్ట లేను."

"ఏమిటీఘోరణి. మీకులేని సుఖం మాకెందుకు. మీరు పలక్కుండా వుండండి. లేనిపోని చింతలు పెట్టుకొని..."

"రేపు పొద్దున వీధిమొహం చూచేదెట్లా. అందరూ నవ్వుతారు."

"ఎందుకు నవ్వుతారూ ప్రమాదాలు అందరికీ వచ్చేవే. యిప్పుడెందుకా ఆలోచనలన్నీ."

"నిజం చెప్పు. నన్ను చూస్తే నీకు ఎగతాళిగా లేదూ?"

"ఏమిటండి మరీనూ. మీకెంతేనా పుణ్య ముంటుంది. కొంచెంసేపు మాట్లాడబోకండి."

"దీనికి జవాబు చెప్పు. ఇంకేమీ అడగను."

"దేనికి ఎగతాళి. మీరేంజేశారని? అసలు మీకెందుకొచ్చిందా అనుమానం?"

"బాధలు అవమానాలతో జీవితము వైరోత పట్టుకుంది రాజ్యం- నేనుచేసే ప్రతిపని యితరులకు నవ్వులాటగా వుంటుందని హడలిపోతుం టాను."

"ఇకచాలించండి. మీకుజ్వరంగా వున్నట్టుంది. డాక్టర్ కోసం ఎవరినన్నా పంపుతాను—"

"ఇంతమాత్రానికే డాక్టరెందుకు. వస్తేవూరక పోతాడూ—"

"అబ్బే మీ మనిసిప్పుడు బాగాలేదు- జ్వరం తొందరలో ఏమేమోమాట్లాడాలని అనిపిస్తుంది. కొంచెం కాఫీకాచి తెస్తాను. ఒరే రామూ మీ నాన్న దగ్గరకు వచ్చి కూర్చో—"

రాజమ్మ కాఫీకాయటానికి పోగా అరుగుపై యింకా వున్న బండి సామగ్రిని చూసి సత్యం వణికిపోతూ కళ్లుమూసుకున్నాడు. డాక్టరువచ్చి చూసి జ్వరం రావచ్చునని మందు పంపుతానని వెళ్లాడు. ఆరాత్రంతా సత్యం పిచ్చిగా వాగుతూ వున్నాడు. రెండు రోజులకిగాని అతనికాజ్వరం తగ్గలేదు.

కౌంట్ ఆఫ్ మాంటెక్రిస్టో నవలను వ్రాసిన ఎలెగ్జాండర్ డ్యూమాస్ తనకు సహాయకుడుగా పనిచేస్తూండిన ఒక పెద్దమనిషి యింటికి చూడడానికి వెళ్ళాడు. కుశలప్రశ్న లడుగుతూ, అతని చంటిబిడ్డనుగూర్చి "పిల్లవాడు కులాసాగా ఉన్నాడా" అని అడిగాడు. దాని కతడు మురిసిపోతూ సమాధానం యిచ్చాడు.

డ్యూమస్: మీ పిల్లవాడు నడుస్తున్నాడా?

అతడు: ఓ, ఇప్పుడా? నెలరోజులనుంచి నడుస్తున్నాడు.

డ్యూమస్: అలాగా, ఐతే చాలాదూరం పోయివుంటాడన్నమాట!